క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం బలోపేతం చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న షఫీవుల్లా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శిగా నియమితులైన షేక్ షఫీవుల్లా ఆదివారం జిల్లా అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవులు అలంకారప్రాయం కాదని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పని చేయాలన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని తెలిపారు. అనంతరం షఫీవుల్లా మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలు గుర్తించి పదవి రావడానికి సహకరించిన పార్టీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్‌కుమార్, మురళీ, నరసింహకుమార్ పాల్గొన్నారు.

చింతకుంట శివారెడ్డికి పురస్కారం



శివారెడ్డిని సన్మానిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకుడిగా పని చేస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఆదివారం పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా సేవ పురస్కారం అందజేశారు. సంస్థ అధ్యక్షులు పైనేని తులసినాథం నాయుడు మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వం దిశగా రచనలు చేయడం ద్వారా తెలుగు భాషా సాహిత్యాలకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివారెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, గ్రంథాలయ సిబ్బంది అభినందించారు.

శివారెడ్డి సేవలు చిరస్మరణీయం



పుత్తా శివారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బడుగు బలహీన వర్గాల నేతలు

కడప రూరల్ : సామాజిక వేత్త పుత్తా శివారెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో చీపాటి రాజేశ్వరరావు అధ్యక్షతన పుత్తా శివారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బి.నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్, స్వామినాథం మాట్లాడుతూ పుత్తా శివారెడ్డి బడుగు, బలహీన వర్గాల పక్షాన అండగా నిలిచారని తెలిపారు. ఆయన మరణం అన్ని వర్గాల వారికి తీరని లోటని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల వారు శివారెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెదురూరు బాబు, మల్లెల జగదీష్, ద్రాక్షం శ్రీనివాసులు, ఆర్ఎస్ రాజు, చంద్రశేఖర్, బాలు, సత్తార్, వెంకట శివ, డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



ధర్నా చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, వారి జీవితాలతో ఆడుకోవద్దని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. ఆదివారం కడప నగరంలో వై జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2020 సంవత్సరంలో కడపలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఢిల్లీలో కౌన్సిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి లేకుండానే విశ్వవిద్యాలయం కొనసాగించడం ప్రస్తుత వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఉపకులపతి విశ్వనాథ్ కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో విఫలమయ్యారన్నారు. సమస్యలను సకాలంలో తీసుకెళ్లి ఉంటే విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయి ఉండేవని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు గురు మోహన్, కొండయ్య, లక్ష్మి చెన్నకేశవ, ప్రమోద్, విశాల్, కరిముల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్ రామ్





ట్రాన్స్‌కో నిలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కడప ఎడ్యుకేషన్ : సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్, దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కై పు రామాంజనేయులు అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కడపలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఒక వైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ సవ్యసాచి అన్నారు. జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానం కలవారిగా చేయాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి సాయి, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో...

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ అన్నారు. కడపలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేసిన కృషీవలుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, కనకరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఉప ప్రధాన మంత్రితోపాటు అనేక ఉన్నత పదవులు నిర్వహించారని, ఆయన చూపిన మార్గంలో నేటితరం నాయకులు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీ ఖాన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, షేక్ నీలం, ముబారక్, కమాల్ బాషా, పి.డి.సంజయ్ కాంత, హమీద్, సిద్ధిక్ షామీర్ హుస్సేన్, పఠాన్ రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ట్రాన్స్ కో కార్యాలయంలో..

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని శంకరాపురం వద్దనున్న ట్రాన్స్ కో కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ డీవీ క్రిష్ణ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవల గూర్చి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు సీఎస్ఆర్ మూర్తి, కె.శ్రీనివాసరావు, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య, ఈఈ నరేంద్ర, డీఈలు రమణ, మనోజ్ నాయుడు, ఏఈ ఆంజనేయులు, చరణ్ పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు



పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో...

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుదర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించి కార్యాచరణను ప్రారంభించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచే 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా రెండు సంవత్సరాలు గడిచినా కనీసం పీఆర్సీ కమిషన్ కూడా నియమించలేదన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పీఆర్సీ కమిషన్ చైర్మన్ రాజీనామా చేసి ఏడాది కావస్తున్నా ఇంతవరకు నూతన కమిషన్ చైర్మన్‌ను నియమించలేదన్నారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా మధ్యంతర భృతిని ప్రకటించి వెంటనే మెరుగైన ఫిట్మెంట్‌తో 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. 2024 జనవరి నుంచి నాలుగు విడతల డీఏలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సి వుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికే మూడు డీఏలను ప్రకటించిందన్నారు. కనీసం రెండు డీఏలనైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఖాదర్ భాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేది జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అనుబంధమైన రైల్వే గూడ్స్ షెడ్ హమాలి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కేసీ బాదుల్లా, మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక కడప రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్ యూనియన్ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బీజేపీ, మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని, ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలోని హమాలీ, వీధి విక్రయదారులకు రవాణా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాలు తీసుకురావాలని కోరారు. బ్రిటీష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలను 4 లేబర్ కోడులుగా పెట్టుబడి దారులకు అనుకూలంగా మార్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను రైల్వే, విమానయానం, పోర్టు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోదీ విధానాలను భుజానికి ఎత్తుకొని ఇటు ఉద్యోగులను అటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్నఓబులేసు, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ విలీన గ్రామాల్లో పడకేసిన పాలన



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడపను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేటప్పుడు కలుపుకొన్న విలీన పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయని నగర కార్యదర్శి యస్.వెంకటశివ పేర్కొన్నారు. పాలెంపల్లెలో ఆదివారం సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50వ డివిజన్ సమగ్రాభివృద్ధికి సీపీఐ ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 50 డివిజన్‌లోని పాలెంపల్లె, రూకవారిపల్లె తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ మంచినీటి సమస్య ఉండటం దారుణమన్నారు. రోడ్లు, డ్రైనేజీ మురికి కాలువల సమస్యలను తీర్చాలన్నారు. చిలకలబావి నుంచి సాయిపేట, పాలెంపల్లె మీదుగా బైపాస్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు చేసి ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో పాత కడప చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తోలుకోవడం తప్ప, మరో అభివృద్ధి లేదన్నారు. ఈ మహాసభలో పాలెంపల్లె శాఖ కార్యదర్శిగా పి.చంద్రశేఖర్‌రెడ్డి, మరో 8 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి, అంకుశం, భాగ్యలక్ష్మి, నాగిరెడ్డి, పక్కీరప్ప, చైతన్య, ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తాం




సమావేశంలో పాల్గొన్న ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక విషయాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.25 వేల కోట్లకు పైగా ఆర్థిక బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. ఐదు పెండింగ్ డీఏలు, పీఆర్సీ కమిషన్ వేసి మధ్యంతర భృతి(ఐ ఆర్) 30 శాతం ప్రకటించడం వంటి ఆర్థిక విషయాలపై కార్యాచరణ రూపొందించి అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి ఆర్థిక ఆర్థిక విషయాలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం త్వరలో తగిన నిర్ణయం తీసుకుని ఉద్యోగులకు రావాల్సిన 25 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర సేవ ప్రముఖ్ ఎరుకలరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షులు బాలానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: టెండర్లు వేసి ఆరు నెలలు అవుతున్నా గదులు చూపెట్టని ఆర్టీసీ ఉన్నత అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. గదుల విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పేద బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఆర్టీసీ టెండర్లలో ప్రవంతి అనే దళిత మహిళ పాల్గొని పి.17ఏ, పి17సి రూములను టెండర్లలో దక్కించుకున్నారని, టెండర్ అలాట్‌మెంట్ ఆర్డర్ కూడా ఆర్టీసీ యాజమాన్యం జారీ చేసిందని పేర్కొన్నారు. వారికి ఇప్పటి వరకు కొలతలు వేసి రూములు చూపెట్టకుండా ఆర్టీసీ ఆర్ఎం, ఈడి, సివిల్ ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్నారు. చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారి పట్ల రీజినల్ మేనేజర్ ఇలా వ్యవహరించడం ఏమాత్రం సరికాదన్నారు. అలాగే లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్న షాపుల నిర్వాహకులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ ధర్నాలో టెండర్లు వేసిన వారందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నృత్య సందడి



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక డ్రీమ్ మీడియా సుజాత వారి సహకారంతో కడపకు చెందిన అఖిల్ డ్యాన్స్ విద్యార్థులు పలు జానపద, సినీ, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామం పాలనాధికారి కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

21న చలో విజయవాడను విజయవంతం చేయాలి

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న జేఎల్ఎం గ్రేడ్–2ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా నియమితులైన జూనియర్ లైన్ -గ్రేడ్2లు పూర్తిగా విద్యుత్ సంస్థలలో పని చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఎప్పటికప్పుడు వినియోగదారులకు సరైన సేవలు అందుతున్నాయని, ఎలాంటి అంతరాయం లేని విద్యుత్తును అందించగలుగుతున్నారన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పండుగలు, సెలవు లేకుండా 24 గంటలు కష్టించి పని చేస్తున్నారని, ఈ క్రమంలో 120 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా మరెంతో మందికి శరీర భాగాలు కాలిపోవడం, అంగవైకల్యం చెందడం జరిగిందని అన్నారు. విద్యుత్ యాజమాన్యం ఉద్యోగ సంఘాలకు తక్షణమే ఎన్నికలను నిర్వహించి గుర్తింపు కలిగిన సంఘంతో చర్చించాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. పాత,కొత్త ఉద్యోగుల మధ్య రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి పూజలు



గడ్డిబజారు ఆలయంలోని సత్యదేవుని ఆలయంలో విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకులు విజయభట్టర్

కడప సెవెన్‌రోడ్స్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని వైష్ణవాలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే కుటుంబాలతో సహా ఆలయాలకు చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కడప నగరం గడ్డి బజారులోని శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి తిరుఆరాధన, విష్ణు సహస్ర నామ సామూహిక పారాయణం, లక్ష్మీ సహస్ర నామ పారాయణం, తులసి అర్చన, నక్షత్ర కుంభ హారతి, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయ ధర్మకర్త వంకధారి రామరత్నమ్మ, సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు విజయ్ భట్టర్ భక్తులకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల అలంకృత ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి సమీప వీధుల్లో ఊరేగించారు. భక్తులు జయజయధ్వానాలు చేస్తూ రథాన్ని లాగుతుండగా వీధుల్లోని భక్తులు తమ ఇళ్ల వద్దకు వచ్చిన స్వామిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివానందపురంలో సమస్యల తాండవం



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్థానిక 15వ డివిజన్ శివానందపురంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, నగరపాలక సంస్థ అధికారులు విఫలం అయ్యారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. శివానందపురంలో ఆర్‌సీపీ నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో పగలగొట్టి, నాశనం చేసి పెట్టారని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులన్నా పూర్తి చేశారా అంటే అదీ లేదన్నారు. అమృత్ పథకం కింద మంచినీటి సరఫరా పైపులైను ఏర్పాటు కోసం మరొక మారు ఆ కొద్దిగా ఉన్న రోడ్డును తవ్వి పాడు చేశారన్నారు. రోడ్డు మధ్యలో అడ్డుగా మ్యాన్‌హోల్ లు, రోడ్డుకు ఇరువైపులా నీరురాని అమృత్ పథకం నీటి పైపులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. మురుగునీటి కాలువలు, వీధుల మధ్యలో రోడ్డు ఇరువైపులా కంప చెట్లు పెరిగాయన్నారు. మంచినీటి అవసరాల కోసం నిర్మించిన ఉపరితల నీటి తొట్టి ప్రారంభానికి కూడా నోచుకోక ముందే శిథిలావస్థకు చేరిందని తెలిపారు. కూలటానికి సిద్ధంగా ఉందని, ఇప్పటికే పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని పేర్కొన్నారు. అది ఏ ఏరోజైనా కూలిపోయే ప్రమాదం ఉందని, పొరపాటున కూలితే ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుందని, కావున అధికారులు తక్షణమే దీనిని తొలగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, లక్ష్మీదేవి, నగర కమిటీ సభ్యులు విజయకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

10న విద్యారంగ సమస్యలపై మహా ధర్నా



మహాధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని జూలై 10వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. కడప నగరంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఆదివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిందని, అయినా విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీవో నెంబర్ 77 వలన పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని 2024- 25 విద్యా సంవత్సరంలో అమలు చేయకుండా ఈ విద్యా సంవత్సరంలో అనేక షరతులు విధించారని, దీని వలన లక్షలాది మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేస్తూ, మెడికల్ కళాశాల భూములు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారన్నారు. మెడికల్ విద్య ప్రైవేటీకరణ చేసే జీవో నెంబర్ 108,109 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్‌లు కూడా సంక్షోభంలో ఉన్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. గత ఏడాది కాలంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి జూలై 7న అన్ని జిల్లా కేంద్రాలు, జూలై 10న విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నగర నాయకులు యశ్వంత్, రమణ, నరేష్, రాజేష్, చంద్రశేఖర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కార్మిక చట్టాలను హరించే విధంగా తెస్తున్న లేబర్ చట్టాలను రద్దు చేయాలని, వివిధ డిమాండ్లతో దేశవ్యాప్తంగా చేస్తున్న సార్వత్రిక సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య మద్దతు తెలుపుతున్నట్లు, ఈ సమ్మెలో నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పని గంటల విధానాన్ని పెంచి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తూ కారు చౌకగా అంబానీ, అదానీల కంపెనీలకు కట్టబెడుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరణ చేస్తూ వేల కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసే ప్రయత్నం జరుగుతోందని, అందుకు ఉదాహరణనే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకపోవడమే అన్నారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నరేంద్రమోదీ చెప్పారని, అవన్నీ గాలి మాటలు గానే మిగిలిపోయాయన్నారు. కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయకుండా ఊడిగం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నర్సింహులు, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



బి.రామలింగారెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యుత్ రంగ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బండి రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలో విద్యుత్ శాఖ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2003 విద్యుత్ చట్టానికి ప్రతిపాదిస్తున్న సవరణలు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ వైపు నెట్టే కుట్రగా ఉందని విమర్శించారు. ఇది లక్షలాది కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదకర చర్య అని, ప్రభుత్వ విధానాల పట్ల నిరసనగా, హక్కుల పరిరక్షణకు జూలై 9 సమ్మె ముఖ్యమైన మలుపు కావాలన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల్ని విడగొట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం యత్నిస్తోందని, ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రైవేటీకరణ జరిగిందన్నారు. అదే దారిలో ఆంధ్రప్రదేశ్ లోనూ ఆదానీ గ్రూప్ వంటి కార్పొరేట్ కంపెనీలకు విద్యుత్ పంపిణీ బాధ్యతలు అప్పగించే ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. విద్యుత్ సేవలు ప్రజల హక్కుగా కాకుండా, లాభాల కోసం విక్రయించే వస్తువుగా మారిపోతాయని, ప్రభుత్వ నియంత్రణ తొలగిపోతే ప్రజలు అధిక చార్జీలు, నాసిరకం సేవలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణతోపాటు కార్మికుల ఉద్యోగ భద్రతకు కూడా తీవ్రమైన ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను హరించేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, ఇవి యాజమాన్యాలకు మద్దతుగా, కార్మికుల హక్కుల్ని కాలరాసే విధంగా రూపొందించబడ్డాయన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ రంగ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని, సమ్మెను విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వానికి గట్టి సందేశం పంపించాల్సిన అవసరం ఉందని చెప్పారు.